సాక్షి
అనకాపల్లి
శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

విశాఖ : నగరంలోని బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.



అప్పన్న సేవలో వైస్ అడ్మిరల్

సింహాచలం: శ్రీ లక్ష్మీనృసింహస్వామిని భారత ప్రభుత్వ చీఫ్ హైడ్రోగ్రాఫర్ వైస్ అడ్మిరల్ అధిర్ అరోరా దర్శించుకున్నారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎం.బి.జి.ఎస్. కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టం 30 నుంచి 32.2, కనిష్టం 23.6 నుంచి 24 డిగ్రీలు, తేమశాతం 80 నుంచి 83, గాలి గంటకు 4 కి.మీ వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..



కవగుంటలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

రావికమతం: మండలంలోని కవగుంట గ్రా మంలో పలువురు టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. చేపూరి నాగేశ్వరరావు, సారిక రాము, కోన ఈశ్వరరావు, కొప్పాక చినరాము తదితర 20 మందికి ప్రభుత్వ విప్ కండువాలు కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. సర్పంచ్ సూర్యకుమారి, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'నైతిక, మానవీయ విలువల' పరీక్ష



అనకాపల్లిలో ఓ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో సుజాత

యలమంచిలి రూరల్: ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు నైతికత, మానవీయ విలువల పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 128 కళాశాలల నుంచి 13,400 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 13,114 మంది హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి బి.సుజాత తెలిపారు. 286 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొత్తం 98 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఆమె తెలిపారు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్ష జరిగింది. పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసి, మార్కులను ఇంటర్మీడియెట్ బోర్డు నిర్దేశించిన వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా కళాశాలల ప్రిన్సిపాళ్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. శనివారం జరగాల్సిన పర్యావరణ విద్య పరీక్షను అధికారులు ఈ నెల 23వ తేదీకి వాయిదా వేశారు. ఈ రెండు పరీక్షల్లో ఉత్తీర్ణులైతేనే రెండేళ్ల ఇంటర్మీడియెట్ పాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు సబ్సిడీ రుణాలు

తుమ్మపాల: స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీపై రుణాలు అందజేస్తున్నట్లు ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.ప్రభాకర్, ఫుడ్ టెక్నాలజీ మేనేజర్ డీటీ అర్తి తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థుల నుంచి పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే పరిశ్రమలు నిర్వహిస్తున్న వారికి కూడా పీఎంఎఫ్‌ఎంఈ పథకంలో వ్యాపారాభివృద్ధికి కావాల్సిన అధునాతన పరికరాల కొనుగోలు, వర్కుషెడ్ నిర్మాణానికి అయ్యే వ్యయంలో బ్యాంకు ద్వారా 90 శాతం రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇందులో 35శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్టు ఫుడ్ టెక్నాలజీ మేనేజర్ డీటీ అర్తి తెలిపారు. జిల్లాలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, స్వయం సహాయక బృందాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 ఏళ్ల వయస్సు నిండిన వారు జిల్లా హార్టికల్చర్ కార్యాలయంలో తమ ఆధార్, పాన్‌కార్డు, కరెంటు బిల్, బ్యాంకు పాస్‌బుక్‌తో సంప్రదించాలన్నారు. మరింత సమాచారం కోసం 9603222037 అనే వాట్సాప్ నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

గిరిజన సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

దేవరాపల్లి: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు గిరిజనుల హక్కులను కాపాడటం అందరి బాధ్యత అని యాత్ర ప్రముఖ్ మహంత్ ఉబ్బేటి నాగేశ్వరరావు అన్నారు. విజయనగరం కేంద్రీయ విశ్వ విద్యాలయం, 'ఆంధ్రప్రదేశ్ వనవాసీ ఆశ్రమ్ సంయుక్త ఆధ్వర్యంలో తూర్పు కనుమలలో గిరిజన సాంస్కృతిక యాత్ర' పేరిట జైపూర్ నుంచి విశాఖపట్నం వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చింతలపూడి పంచాయతీ సమ్మెదలో సమావేశం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి పునరుద్ధరణ తదితర అంశాలపై యాత్ర ప్రముఖ్ నాగేశ్వరరావు వివరించారు. మాజీ ఎంపీటీసీ బి. సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.



తొలిరోజు సూపర్‌హిట్

- భారత్, ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌కు పోటెత్తిన అభిమానులు
- క్యూకట్టిన విద్యార్థులు
- కేరింతలతో హోరెత్తిన స్టేడియం

ఆహ్లాదకర వాతావరణం.. భారీగా హాజరైన అభిమానులు.. ఆపై మైదానంలో మన ఆటగాళ్ల జోరు.. మొత్తంగా భారత్, ఇంగ్లండ్ రెండో టెస్ట్ మ్యాచ్ తొలిరోజు అభిమానుల అంచనాలకు తగినట్లుగా సరైన వినోదాన్ని పంచింది. ఉదయం టాస్ ముందు ప్రాక్టీస్ సమయం నుంచే కోలాహలం కనిపించింది. యశస్వి చక్కటి షాట్లతో అందరినీ అలరించాడు. రోహిత్ ఔటైనప్పుడు నిశ్శబ్దం కనిపించింది. లోకల్ ప్లేయర్ భరత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఏసీఏ ప్రత్యేక ఏర్పాట్లతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. పెవిలియన్ ఎండ్స్, ఇటు మీడియా బాక్స్ దరి స్టాండ్స్ నుంచి అభిమానుల హర్షాతిరేకాలతో స్టేడియం దద్దరిల్లింది.

– విశాఖ స్పోర్ట్స్



క్రికెట్ అభిమానులతో కిక్కిరిసిన స్టేడియం

వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన భారత్- ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులు పోటెత్తారు. కౌంటర్లలో టికెట్ల విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. ఇంగ్లండ్ అభిమానులు సైతం లైన్లలో నిల్చొని మరీ ప్రవేశం పొందారు. రెండు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తామని ముందుగానే ఏసీఏ ప్రకటించడంతో.. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు క్యూ కట్టారు. వీరందరినీ స్టేడియంలోని 'కె'స్టాండ్ లోయర్ టైర్‌లో అనుమతించారు. కొందరు స్టేడియం బయటే ఉండిపోగా.. వారిని కూడా అప్పర్ టైర్‌లోకి అనుమతించారు. ఏసీఏ అనుబంధ క్లబ్‌ల ఔత్సాహిక క్రికెటర్లకు స్టేడియం సౌత్ బ్లాక్‌లోని సీ, డీ స్టాండ్స్‌లోకి ప్రవేశం కల్పించారు. ఈ సందర్భంగా ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తొలిరోజు మ్యాచ్‌కు అనుకున్న దాని కంటే ఎక్కువ మంది అభిమానులు తరలివచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు, అనుబంధ క్లబ్‌ల ఔత్సాహిక ఆటగాళ్లకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం స్టేడియంలో పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేసిందని వెల్లడించారు. థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. ఎక్కువ మంది అభిమానులు రావడంతో ఫుడ్ విషయంలో కాస్త ఆలస్యం అయిందని, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దుతామన్నారు.

స్టేడియంలో ముచ్చటగా మూడోసారి

ఇక్కడ జరిగిన టెస్ట్ మ్యాచ్‌ల్లో భాగంగా ఆతిథ్య భారత్ జట్టు ముచ్చటగా మూడోసారి టాస్ గెలిచింది. ఇక్కడ తొలిసారిగా ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన టెస్ట్‌లో టాస్ గెలిచిన భారత్ రెండు రోజుల్లోనే ఆటను ముగించేసి శుభారంభం చేసింది. దక్షిణాఫ్రికా జట్టుతో జరిగిన మ్యాచ్‌లోనూ టాస్ గెలిచి రెండో ఇన్నింగ్స్‌ను పూర్తిగా ఆడకుండానే డిక్లేర్స్ చేసి విజయకేతనం ఎగురవేసింది. మరోసారి ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్‌లోనూ టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ తొలిరోజు ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ తొలిరోజు ఆట తొలి బంతి నుంచి చివరి బంతి వరకూ క్రీజ్‌లో నిలవడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. లోకల్ బాయ్ భరత్ కేవలం 23 బంతులే ఆడి వెనుతిరగడంతో అభిమానుల్లో కాస్త నిరాశ కనిపించింది. ఈ స్టేడియంలో ఇంగ్లండ్ తరఫున షోయబ్ బషీర్, భారత తరఫున రజత్ పటీదార్ అరంగేట్రం చేశారు. షోయబ్ తన తొలి వికెట్‌గా భారత్ కెప్టెన్ రోహిత్‌ను పెవిలియన్ దారి పట్టించాడు. పటీదార్ నిలకడగా రాణించినా అర్ధ సెంచరీ నమోదు చేయలేకపోయాడు.



అవుటై వెనుతిరుగుతున్న రోహిత్ శర్మ, ఆనందంలో ఇంగ్లాండ్ ఆటగాళ్లు





మ్యాచ్‌ను తిలకిస్తున్న ప్రేక్షకులు



క్రికెట్ అభిమానుల కోలాహలం



షాట్ కొడుతున్న భరత్



బైనాక్యులర్‌తో చూస్తున్న క్రికెట్ అభిమాని

స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి వసతులు



అంతర్జాతీయ స్థాయికి ఏ మాత్రం తీసిపోని విధంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో వసతులు ఉన్నాయి. ఏసీఏ సిబ్బంది ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినా ప్రేక్షకుల మధ్యలోనే కూర్చొని మ్యాచ్ చూడటం ఎంతో ఆనందంగా ఉంది. ఇండియాకు వచ్చిన తర్వాత ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చొని మ్యాచ్ చూడటం ఇదే మొదటి సారి. అభిమానులు మ్యాచ్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున వచ్చారు. వారందరికీ ఏసీఏ తగిన విధంగా ఏర్పాట్లు చేయడం అభినందనీయం.

– గరెత్ విన్ ఓవెన్, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్, ఏపీ, తెలంగాణ

లేగదూడల సంరక్షణతోనే పశు సంపద వృద్ధి

బుచ్చెయ్యపేట: లేగ దూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపి సంరక్షించినపుడే పశు సంపద వృద్ధి చెందుతుందని పశు సంవర్ధకశాఖ ఈడీ బి. రామ్మోహనరావు తెలిపారు. కొమళ్లపూడిలో విశాఖ డెయిరీ కేంద్రం వద్ద జిల్లా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శనను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చాలా మంది రైతులు లేగ దూడలకు సరిపడినంతగా పాలు, పోషకాలు అందించకపోవడం వల్ల పుట్టిన రెండు, మూడు నెలల్లోనే మృతి చెందుతున్నాయని చెప్పారు. మరికొంత మంది రైతులు వాటి పెంపకంపై శ్రద్ధ చూపకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నట్టు చెప్పారు. లేగదూడల పెంపకంపై శ్రద్ధ చూపితే రైతులకు ఆదాయంతో పాటు పశు సంపద పెరుగుతుందన్నారు.

లింగనిర్ధారిత వీర్యం ద్వారా ఆడ పెయ్యిలు ఎక్కువగా పుడతాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో పలు గ్రామాల నుంచి తీసుకొచ్చిన 52 లేగ దూడలు పాల్గొనగా, సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న మొదటి మూడు లేగదూడలకు చెందిన రైతులకు బహుమతులు అందజేశారు.



రైతులకు బహుమతులు అందిస్తున్న ఈడీ,నాయకులు

పీడీ పాలెంకు చెందిన కరణం అప్పారావు లేగ దూడకు మొదటి బహుమతి, కొమళ్లపూడికి చెందిన గేదెల సత్యనారాయణ లేగ దూడకు రెండవ బహుమతి, పొట్టిదొరపాలెంకు చెందిన గుద్దేటి కోటి వరహాలకు చెందిన లేగ దూడకు మూడవ బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రి పశువైద్యాధికారి శివకుమార్ రైతు సంఘం నాయకులు వేపాడ మధు, ఈశ్వరరావు, నాగేంద్ర, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

9న అప్పన్న తెప్పోత్సవం

సింహాచలం: పుష్యబహుళ అమావాస్యని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం(నౌకా విహారం) ఈనెల 9న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం సుమారు 3.30 గంటలకు స్వామివారిని కొండదిగువ వరాహ పుష్కరిణిని తీసుకురావడం జరుగుతుందన్నారు. సాయంత్రం 5.30 గంటల నుంచి తెప్పోత్సవం ప్రారంభమవుతుందన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

అనకాపల్లి: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఎనిమిది మంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుల పరిశీలన అనంతరం పరిష్కరిస్తానన్నారు. అదనపు ఎస్పీ బి.విజయ్‌భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న సహాయక కలెక్టర్ స్మరణ్‌రాజ్

కశింకోట: పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహాయక కలెక్టర్ స్మరణ్ రాజ్ తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం సచివాలయంలో నిర్వహిస్తున్న పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి సత్యారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కశింకోటలోని సచివాలయాల్లో ఇప్పటి వరకు సుమారు 110 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేశారు.

జిల్లా స్థాయి పోటీల్లో చోడవరానిదే హవా



క్రికెట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన మహిళా జట్టుతో అధికారులు



బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచిన మహిళాజట్టుకు నగదు, కప్ అందిస్తున్న అధికారులు

- 4 విభాగాల్లో సత్తా
- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

అనకాపల్లి: ఆడుదాం – ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల్లో చోడవరానిదే హవా సాగింది. నువ్వా నేనా అన్నట్టుగా సాగిన ఫైనల్ మ్యాచ్‌ల్లో పలు జట్లు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. వాటిలో పురుషుల క్రికెట్‌లో పాయకరావుపేట, వాలీబాల్‌లో చోడవరం, ఖో–ఖోలో అనకాపల్లి, బ్యాడ్మింటన్‌లో చోడవరం జట్లు, మహిళల క్రికెట్‌లో పెందుర్తి, వాలీబాల్‌లో పాయకరావుపేట, ఖోఖో, బ్యాడ్మింటన్‌లో చోడవరం జట్లు ఉన్నాయి. శుక్రవారం ఎన్టీఆర్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల మహిళలు, పురుషుల జట్లు తలపడ్డాయి.

ఈ రెండు జట్ల మధ్య పోరులో పాయకరావుపేట మహిళల జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి అనకాపల్లి ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన జట్లకు రూ.60 వేల చొప్పున బహుమతి, కప్‌ను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు దోహదపడతాయన్నారు. మట్టిలో మాణిక్యాలుగా మిగిలిపోతున్న క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీల్లో చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దారుఢ్యం మెరుగుపరుచుకోవచ్చన్నారు. క్రీడా కోటా ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడవచ్చని సూచించారు. క్రీడల పట్ల యువత ఆసక్తి పెంచుకోవాలన్నారు. స్థానిక డీసీఎంఎస్‌లో కబడ్డీ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి ఎల్.రమణ, డీటీ శ్రీరామ్మూర్తి, క్రీడా అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఖోఖోలో విజేతగా నిలిచిన మహిళా జట్టుకు నగదు, కప్ అందిస్తున్న అధికారులు



కబడ్డీలో విజేతగా నిలిచిన పురుషుల జట్టుతో అధికారులు

క్లుప్తంగా

అదృశ్యమైన మతిస్థిమితం లేని మహిళ మృతి

మాకవరపాలెం: అదృశ్యమైన మతిస్థిమితం లేని ఓ మహిళ మృతి చెందింది. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తూటిపాలకు చెందిన గవిరెడ్డి అచ్చియ్యమ్మ(56)కు మతిస్థిమితం లేదు. మూర్ఛవ్యాధి కూడా ఉంది. 15 రోజులుగా ఆమె కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినా ఆమె జాడ తెలియరాలేదు. శుక్రవారం పెద్దిపాలెం సమీపంలోని నేల బావిలో ఆమె మృతదేహం లభ్యమైంది. మృతురాలి అక్క అడిగర్ల గంగతల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అపరాల సాగులో తెగుళ్లు

- నివారణకు కేవీకే శాస్త్రవేత్తల సూచనలు



దేవరాపల్లిలో రైతులకు సూచనలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: అపరాల సాగులో తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, సౌజన్య, బాబు రైతులకు సూచించారు. దేవరాపల్లి దరి సంతతోటలో మినప, వేరుశనగ, నువ్వు పంటలను ఏవో వై. కాంతమ్మతో కలిసి వారు శుక్రవారం పరిశీలించారు. వేరుశనగలో మొదలు కుళ్లు తెగులు ఆశించినట్లు గుర్తించారు. దీని నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి మొదళ్లు తడిచే విధంగా పిచికారీ చేయాలని సూచించారు. మినపలో బూడిద తెగులు నివారణకు ప్రోపికొనజోల్ మిల్లీ గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సమగ్రంగా వివరించారు.

ప్రగతిబాటలో పల్లెలు

- చీడికాడ మండలంలో రూ. 12.22 కోట్లతో పూర్తి చేసిన తారురోడ్లు, భవనాలకు ప్రారంభోత్సవం
- మాడుగులలో రూ.5.2. కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులకు..
- హాజరు కానున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: పల్లెల ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు కేటాయించారు. దీంతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అవి పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. శనివారం మండలంలో రూ. 12.22 కోట్లతో వివిధ గ్రామాల్లో తారురోడ్లు, సచివాలయ భవనాలు, సీసీ రోడ్లు ప్రారంభం కానున్నాయి.

- రూ. 7.80 కోట్లతో తారురోడ్ల ప్రారంభం
- రూ. 2.20 కోట్లతో చీడిపల్లి నుంచి అర్జునగిరి పసువుగెడ్డపై నిర్మించిన వంతెనపై 3.5 కిలోమీటర్ల తారురోడ్డు
- రూ. 90 లక్షలతో అర్జునగిరి నుంచి చెట్టుపల్లి వరకు నిర్మించిన తారురోడ్డు
- రూ. 1.60 కోట్లతో చెట్టుపల్లి కాటా నుంచి చెట్టుపల్లి మీదుగా వరాహపురం, పెదగోగాడ వరకు 2.65 కిలోమీటర్ల తారురోడ్డు
- రూ. 1.15 కోట్లతో చుక్కపల్లి నుంచి బోయిలకింతాడ(దేవరాపల్లి మండలం)కు 1.60 కిలోమీటర్ల తారురోడ్డు
- రూ. 1.45 కోట్లతో నిర్మించిన ఎల్.బి.పట్నం నుంచి కె.ఎల్.బి. పట్నం వరకు 2.85 కిలోమీటర్ల తారురోడ్డు
- రూ. 1.50 కోట్లతో వరాహపురం నుంచి పెదగోగాడకు 3.20 కిలోమీటర్ల తారు రోడ్డుకు ప్రారంభోత్సవాలు జగనున్నాయి.
- రూ 3.92 కోట్లతో చీడికాడ, శిరిజాం, చుక్కపల్లి, ఖండివరం గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించనున్నారు.
- రూ. 30 లక్షలతో కిలోమీటరున్నర సీసీ రోడ్డు, మరో రూ. 10 లక్షలతో దెబ్బతిన్న కోనాం–చోడవరం నుంచి ఖండివరం మీదుగా వీబీ పేటకెళ్లే తారురోడ్డుకు అనుసంధానంగా పూర్తయిన సీసీ రోడ్డును ప్రారంభానికి సిద్ధం చేశారు.



శిరిజాం వెల్‌నెస్ సెంటర్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఖండివరం రైతు భరోసా కేంద్రం, సచివాలయం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న చీడిపల్లి అర్జునగిరి రోడ్డు

మాడుగులలో మరిన్ని..



ప్రారంభానికి సిద్ధంగా కింతలి వల్లాపురం రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలు



ప్రారంభానికి సిద్ధమైన వొమ్మలి సచివాలయం



ప్రారంభానికి సిద్ధమైన ఎల్. గవరవరం వరకు వేసిన తారురోడ్డు

మాడుగుల : మండలంలో సత్యవరం గ్రామంలో రూ. 21 లక్షలతో నిర్మాణం జరిగిన వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రం, అవురువాడ వీరనారాయణంలో రూ. 44 లక్షలతో పూర్తయిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రాలు, కింతలి వల్లాపురంలో రూ. 40 లక్షలతో గొరిగెడ్డపై నిర్మించిన కాజ్‌వే, రూ. 43 లక్షలతో సచివాలయం, రూ. 23 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ. 21 లక్షలతో వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రం, జేడీపేట పంచాయితీ ఎల్. గవరవరంలో రూ. 1. 40 కోట్లతో నిర్మాణం పూర్తయిన బీటీ రోడ్డు, రూ. 30 లక్షలతో సీసీ రోడ్డు, రూ. 20 లక్షలతో సామాజిక భవనం, ఒమ్మలి గ్రామంలో రూ. 43 లక్షలతో నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయం, రూ. 21 లక్షలతో నిర్మాణం పూర్తయిన వైఎస్సార్ గ్రామ ఆరోగ్యకేంద్రం, జి. అగ్రహారంలో రూ. 21 లక్షలతో నిర్మాణం జరిగిన వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం ప్రారంభించనున్నారు.

వీటితో పాటు రూ. 63 లక్షలతో నిర్మించనున్న అవురువాడ పంచాయితీ చిన గొర్రిగెడ్డ వద్ద గొర్రిగెడ్డపై నూతన కాజ్‌వే నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శంకుస్థాపన చేయనున్నారు.

మా కష్టాలు తీరనున్నాయి..



సీఎం జగన్, డిప్యూటీ సీఎం బూడి దయవలన మా కష్టాలు తీరనున్నాయి. ఖండివరానికి చెందిన సగం మంది రైతులకు చెందిన పొలాలు బుచ్చమ్మగారి కళ్లాలకు వెళ్లే మార్గంలోనే ఉన్నాయి. అయితే మట్టిరోడ్డు కావడంతో చిన్నపాటి జల్లు కురిసినా కళ్లాల నుంచి వచ్చేందుకు తీవ్రంగా ఇబ్బంది పడేవారం. ఈ సమస్యను మా పెద్దలు గతంలో అధికారులు, నాయకులకు తెలిపినా పని కాలేదు. దాంతో బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసికెళ్లాం. ఆయన స్వయంగా వచ్చి అంతా చూశారు. వెంటనే రోడ్డు వేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు పూర్తి చేశారు. ఆయనకు మా రైతులందరం రుణపడి ఉంటాం.

కుంచా ఎర్రిబాబు, రైతు, బుచ్చమ్మవారి పాలెం, ఖండివరం

అభివృద్ధి వెలుగులు..



మా గ్రామం నుండి అవతలికి వెళ్లడానికి గొరిగెడ్డ దాటాలి. మా తాతలు, తండ్రుల నుండి ఈ సమస్య ఉంది. ఎంతో మంది నాయకులు వచ్చారు. కాని పనులు జరగలేదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 40 లక్షలతో కాజ్‌వే పూర్తయింది. రూ. 18 లక్షలతో పాఠశాల రూపురేఖలు మార్చారు. మా గ్రామంతో పాటు పనుకు గదబూరు, శరబన్నపాలెం, గ్రామాలకు ఇబ్బందులు తప్పాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు కృషి ఫలితంగా కోట్లాది రూపాయలతో మా గ్రామం అభివృద్ధి చెందింది. చాలా ఆనందంగా ఉంది.

– మట్టా గోవింద్, ఉపసర్పంచ్, కింతలి వల్లాపురం

కె.కోటపాడులో అభివృద్ధి పనులు ప్రారంభం

కె.కోటపాడు: మండలంలో రూ.9.59 కోట్లతో పూర్తి చేసుకున్న 11 అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు శిలాఫలకాలను శుక్రవారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. కె.కోటపాడులో రూ.5.60 కోట్లతో నిర్మించిన సీహెచ్‌సీ అదనపు భవనాలను ప్రారంభించారు. కె.కోటపాడు–కింతాడ, కె.కోటపాడు–మేడిచర్ల మార్గాల మధ్య రూ.2 కోట్లతో రెండు తారురోడ్లను, జంగాల కాలనీలో రూ.6 లక్షలతో సామాజిక భవనం, రూ.63 లక్షలతో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను, రెల్లిపేటలో రూ.16 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీ, గవర, బత్తి, జంగమ కులస్తుల కాలనీ వాసులకు రూ.40 లక్షలతో సీసీరోడ్డు, డ్రైనేజీ, రూ.10 లక్షలతో ఆస్పత్రి నుంచి బంక్ వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ, రూ.30 లక్షలతో పాత పోలీసుల స్టేషన్ నుంచి జంగాల కాలనీ వరకూ సీసీ డ్రెయిన్, రూ.17 లక్షలతో మంచినీటి కోనేరుకు సీసీరోడ్డుతోపాటు రెండు రుద్ర భూములకు సీసీరోడ్డు, షెల్టర్, రూ.80 లక్షల నాడు–నేడు నిధులతో పూర్తి చేసుకున్న జూనియర్ కళాశాల అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు.



అదనపు భవనాల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

అభివృద్ధిని అడ్డుకుంటున్నది టీడీపీయే

- ఆ పార్టీ కౌన్సిలర్లపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల ఆగ్రహం
- అర్థంతరంగా ముగిసిన నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం





వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల వాగ్వాదం, మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: మున్సిపాలిటీలో అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు అడ్డుపడుతున్నారని వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దీంతో మున్సిపల్ కౌన్సిల్ సభలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం స్థానిక మున్సిపల్‌లో కౌన్సిల్ సమావేశం జరిగింది. ముందుగా అధికారులు ఎజెండా చదవటం పూర్తివగానే, వైస్ చైర్మన్ రామకృష్ణ లేచి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.8.50 కోట్లు తీసుకువచ్చారన్నారు. అభివృద్ధిని అడ్డుకోవాలనే దురుద్దేశంతో టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ నాయుడుతో కోర్టులో కేసు వేయించి 38 వర్కులపై స్టే తీసుకువచ్చారని విమర్శలు గుప్పించారు. దీనికి టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు స్పందించి అభివృద్ధి పనులను అడ్డుకోవాల్సిన అవసరం తమకు లేదని బదులిచ్చారు. మెయిన్ రోడ్డు విస్తరణలో అయ్యప్పస్వామి ఆలయం తొలగించకుండా ఏ న్యాయవాదితో కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చారో.. అతనితోనే కేసు వేయించి 38 వర్కులపై స్టే తీసుకురావటం వాస్తవం కాదా అని ఎదురు ప్రశ్నించారు. దాంతో కావాలనే తమపై బురద జల్లుతున్నారంటూ టీడీపీ కౌన్సిలర్లు వాదనకు దిగారు. వారు స్టే తీసుకొచ్చిన నాటికే 35 వర్కులు పూర్తి చేశామని వైస్ చైర్మన్ రామకృష్ణ వ్యాఖ్యానించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ముందు కొట్టుకుపోతారన్నారు. పట్టణాన్ని అభివృద్ధి చేయటమే ఎమ్మెల్యే ఆకాంక్ష అన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న టీడీపీని ప్రశ్నించకుండా జనసేన కౌన్సిలర్ సౌజన్య ద్వంద్వ వైఖరిని వైస్ చైర్మన్ అప్పలనాయుడు ఎండగట్టారు. ఈ క్రమంలో అధికార, ప్రతి పక్ష కౌన్సిలర్ల కేకలతో సభ దద్దరిల్లింది. టీడీపీ కౌన్సిలర్ల తీరు పట్ల చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేస్తూ సభను అర్థాంతరంగా ముగించారు. టీడీపీ కౌన్సిలర్లు ఎప్పుడూ ఎజెండా చదువుతుండగానే ఏదో అంశంపై గొడవ చేసి సభ నుంచి వాకౌట్ చేసేవారు. ఈసారి టీడీపీ కౌన్సిలర్ల ఎత్తుగడలను పాలకపక్ష సభ్యులు తిప్పికొట్టారు. సమావేశంలో కమిషనర్ రవి బాబు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని గిరిజన మహిళ మృతి

దేవరాపల్లి : మండలంలోని శ్రీరాంపురం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వాలాబుకు చెందిన గిరిజన మహిళ దిప్పల దేముడమ్మ (38) మృతి చెందింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న మృతురాలి మరిది దిప్పల దేముడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి వాలాబు గ్రామస్తులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ శివారు పాతవాలాబు గ్రామానికి చెందిన దిప్పల దేముడమ్మ అనారోగ్యంతో బాధపడుతూ తన మరిది దేముడు ద్విచక్ర వాహనంపై వైద్యం నిమిత్తం దేవరాపల్లి ఆస్పత్రికి బయలుదేరింది. శ్రీరాంపురం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. ద్విచక్ర వాహనంపై ఉన్న దేముడమ్మతో పాటు ఆమె మరిది దేముడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను దేవరాపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దేముడమ్మ మృతి చెందింది. మృతురాలికి భర్త ఎరకన్నదొర, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ డి. నాగేంద్ర తెలిపారు.



బాధితులు ప్రయాణించిన ద్విచక్ర వాహనం (ఇన్‌సెట్) దిప్పల దేముడమ్మ (ఫైల్)

600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



బెల్లం పులుపును స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ రమేష్, సిబ్బంది

కె.కోటపాడు : ఆర్.వై.అగ్రహారం శివార్లలో నాటు సారా తయారీ జరుగుతుందన్న ముందస్తు సమాచారంతో శుక్రవారం ఎ.కోడూరు పోలీసులు తనిఖీలు చేపట్టారు. గెడ్డ పరిసరాల్లో నాటుసారా తయారీకి డ్రమ్ములతో పాటు పాత్రల్లో సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం పులుపును ఎస్‌ఐ జె.రమేష్ గుర్తించారు. సిబ్బంది సహాయంతో ధ్వంసం చేశారు. నాటుసారా తయారీకి పాల్పడితే చట్టప్రకారం కఠిన శిక్షలు అమలు చేయనున్నట్లు ఎస్‌ఐ రమేష్ పేర్కొన్నారు. దాడుల్లో ఎస్‌ఐతో పాటు సిబ్బంది సన్నిబాబు, శ్రీను, నాయుడు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు స్వాహా

తుమ్మపాల: ఏటీఎం కార్డును మార్చి నగదు దోచుకున్న ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబర్ నెలలో మునగపాక మండలం తిమ్మరాజుపేటకు చెందిన కాండ్రేగుల దొరప్పనాయుడు అనకాపల్లి మెయిన్ రోడ్‌లోని ఏటీఎం సెంటర్లో తన అకౌంట్ నుంచి డబ్బులు డ్రా చేసేందుకు వచ్చాడు. ఇందుకు అక్కడున్న ఇద్దరు వ్యక్తుల సాయం తీసుకున్నాడు. అయితే ఏటీఎం నుంచి నగదు రావడం లేదని చెప్పి, వారు డూప్లికేట్ కార్డు అతనికి ఇచ్చారు. ఆ కార్డుతో దొరప్పనాయుడు వెనుతిరిగిన వెంటనే ఆ ఇద్దరు వ్యక్తులు ఒరిజనల్ కార్డుతో రూ.45 వేల డ్రా చేసి, కాజేశారు. దొరప్పనాయుడు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్యప్రదాయిని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి

- అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి
- ఆస్పత్రిలో బ్రాకీ థెరపీ యూనిట్ ప్రారంభం



ఆస్పత్రిలో బ్రాకీ థెరపీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న అనకాపల్లి కలెక్టర్ పట్టన్‌శెట్టి

అగనంపూడి: క్యాన్సర్ రోగుల పాలిట ఆరోగ్య ప్రదాయినిగా అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధనా కేంద్రం నిలుస్తోందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అన్నారు. అగనంపూడిలోని ఆస్పత్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన బ్రాకీ థెరపీ సూట్ బ్లాక్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడిన ఎంతోమందికి ఈ ఆస్పత్రి వరప్రదాయినిగా నిలిచి, సేవలందించడం జిల్లాకే గర్వకారణమన్నారు. సేవలు అందిస్తున్న వైద్యులను, సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డులను, అక్కడి వసతులను పరిశీలించారు. సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ మహంతి, జిల్లా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.హేమంత్, ముఖ్య ప్రణాళికాధికారి జి.రామారావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు గునుపూడి విద్యార్థిని

నాతవరం: మండలంలోని గునుపూడి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న వై.మెర్సీ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్టు హైస్కూల్ హెచ్‌ఎం టి.శివ జ్యోతి తెలిపారు. మెర్సీని హెచ్‌ఎంతో పాటు పీఈటీ ఎల్.అప్పలనాయుడు సీఆర్పీ పోలుపర్తి నాగేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ అభినందించారు.



మెర్సీని అభినందిస్తున్న హెచ్‌ఎం శివజ్యోతి

సీఎం జగన్ విజన్‌తో గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి

రావికమతం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌తో గ్రామాల్లో రూ.కోట్లాది నిధులు వెచ్చించి శాశ్వత అభివృద్ధి, మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలో కవగుంట, కొమిర, చినపాచిల, గుమ్మాళ్లపాడు, మరుపాక పంచాయితీ శివారు గ్రామాల్లో రూ.11 కోట్లతో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాలు, జల్ జీవన్ మిషన్, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాడు చంద్రబాబు హయాంలో ఏ పని కావాలన్నా రావికమతం వెళ్లాల్సి వచ్చేదని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్య స్థాపన చేశారన్నారు. సచివాలయాలను అందుబాటులోకి తెచ్చి పనులన్నీ గ్రామంలోనే చేసేలా చర్యలు చేపట్టగా ఆర్‌బీకేతో రైతులకు అన్నీ అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్లకుండా వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లతో వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. చోడవరం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.1,084 కోట్లు వెచ్చించామన్నారు. గ్రామాల్లో ఈ పనులు కనిపిస్తున్నా ప్రతిపక్షాలు, పచ్చమీడియా దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాశినాయుడు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



కొమిరలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

రెండు కిలోల గంజాయి స్వాధీనం

తుమ్మపాల: కారులో తరలిస్తున్న రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ చెప్పారు. అనకాపల్లి మండలం ఏఎంఏఎల్ కాలేజీ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సమయంలో నెల్లూరు జిల్లాకు చెందిన చేమర్తి వెంకట్ అనే వ్యక్తి పాడేరు నుంచి నెల్లూరుకు కారులో వెళ్తుండగా తనిఖీ చేశామని ఎస్‌ఐ చెప్పారు. ఆ తనిఖీలో గంజాయి బయటపడిందని తెలిపారు. వెంకట్‌ను అరెస్టు చేశామన్నారు. అదే కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారని, వారి కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పరిషత్ సప్తాహ్‌లో భాగంగా అయోధ్య రామమందిర వివాద అంశంపై జరిగిన పోటీలకు 7 పాఠశాలల నుంచి 127 విద్యార్థినులు హాజరయ్యారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి ఎన్‌పీ బీ.వర్మ, సభ్యులు వై.కేశవరావు, కె.దుర్గాప్రసాద్, ఎస్.కోటేశ్వరరావు, వి.ఈశ్వరరావు, సాన త్రినాథరావు, కేఎల్ఎన్.మూర్తి, కె.రమణ అప్పారావు పాల్గొన్నారు.

రూరల్ సీఐ ధనుంజయ్ బాధ్యతల స్వీకరణ



అనకాపల్లి: గ్రామీణ సీఐగా ఎస్.ధనుంజయ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా పని చేస్తానన్నారు. నాటుసారా, అక్రమ మద్యం నిల్వలకు తావివ్వకుండా చూస్తామన్నారు. పలువురు పోలీసు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉద్యోగుల నిరసన

అనకాపల్లి: ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొంది చినబ్బాయ్ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలతో పాటు సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు కట్టా శ్రీను, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై చైతన్యం అవసరం

అనకాపల్లి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ చైతన్యం కలిగి ఉండాలని పట్టణ సీఐ జి.శంకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఇటీవల కాలంలో పలు ప్రాంతాల నుంచి సైబర్ నేరాల పట్ల పలువురు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మెసెజ్‌లు, తెలియని నంబర్ల నుంచి ఫోన్లు వచ్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 7.630 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,640	4,670
మొదటి రకం	3,560	4,100
రెండో రకం	3,450	3,760
మూడోరకం	3,350	3,570

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	: రాజా
అంబాజీపేట మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్క్రీన్-1
బూట్‌కట్ బాలరాజు	: సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ	: షిర్డిసాయి
ధీర	: పర్తిసాయి
కిస్మత్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 78 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-14 యూనిట్లు, ఓ పాజిటివ్-44 యూనిట్లు, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరు ద్వారా సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 271 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 243 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

- వెదురుపర్తిలో 480 మందికి పరీక్షలు
- 10 మందికి మెరుగైన వైద్యానికి సిఫార్స్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యురాలు యశోద



వెదురుపర్తిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరై రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న ప్రజలు



కంటి పరీక్షల కోసం రోగుల నిరీక్షణ



వృద్ధుడు రాయి తలుపులుకు వీల్ చైర్‌లోనే రక్త పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కశింకోట: మండలంలోని వెదురుపర్తి సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 480 మందికి వైద్య సేవలందించారు. 113 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో పది మందికి శస్త్ర చికిత్సలు, 61 మందికి కళ్లద్దాలు అవసరమని సిఫార్స్ చేశారు. కీళ్లు, ఎముకల ప్రత్యేక నిపుణుడు ఎస్.గోపి, మహిళా వైద్య నిపుణురాలు విష్ణుప్రియ, పీహెచ్‌సీ వైద్యాధికారి వై.యశోద, ఆప్తాలమిక్ సంధ్య.. రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. అవసరమైన వారికి పది రకాల రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. 59 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. జిల్లా ఆరోగ్య శాఖ ప్రాజెక్టు ఆఫీసర్ జగదీష్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు, ఏఎన్ఎం దేవుడమ్మ, సీహెచ్‌వో ప్రశాంతి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు సేవలందించారు.

వీల్ చైర్‌లో తీసుకొచ్చి వైద్యం

వెదురుపర్తి గ్రామానికి చెందిన రాయి తలుపులుకు 80 ఏళ్లు. చాలా కాలంగా కాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. చేతి కర్ర, కుటుంబ సభ్యుల సహకారంతో కాలం నెట్టుకొస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసి వచ్చారు. వీల్ చైర్ సమకూర్చి ఆరోగ్య సిబ్బంది వైద్యునికి వద్దకు తీసుకెళ్లారు. వైద్యుడు సంబంధిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. తగ్గుతుందని ధైర్యం చెప్పారు. దీంతో తలుపులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

కంటి పరీక్షలు చేశారు..



శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నాను. కళ్లద్దాల కోసం సిఫార్స్ చేశారు. ఉచితంగా మందులిచ్చారు.

– కోసూరి లక్ష్మి, వెదురుపర్తి.

చెంతకే వైద్యం చాలా బాగుంది..



పక్కలో నొప్పి, కాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. శిబిరంలో వైద్యులు సంబంధిత పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. గ్రామానికి వైద్య నిపుణులు వచ్చి పరీక్షలు చేయడం చాలా బాగుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు.

– కాండ్రేగుల అప్పారావు, వెదురుపర్తి

కశింకోట తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ మధుసూదనను అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కశింకోట: కశింకోట నూతన తహసీల్దార్‌గా ఎల్.మధుసూదన శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఇక్కడ పని చేసిన తహసీల్దారు జి.సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళికి బదిలీ అయ్యారు.

మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

తుమ్మపాల: షాపులో పని చేస్తున్న వ్యక్తి కస్టమర్ నుంచి రూ.50 వేలు తీసుకుని, తమకు ఇవ్వలేదంటూ యజమాని రవికుమార్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి.. పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ వద్ద భారీ వాహనాల స్పేర్ పార్ట్స్ దుకాణంలో పనిచేస్తున్న కర్రి లీలా సింహ భరత్ కస్టమర్‌కు వస్తువులను విక్రయించి రూ.50 వేలు నగదు తీసుకున్నారు. అయితే ఆ నగదును షాపు యజమానికి ఇవ్వకపోవడంతో, యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం



గణేష్‌రెడ్డి, అప్పలనాయుడులను సత్కరిస్తున్న నాగభూషణం

అనకాపల్లి: స్థానిక సబ్ జైలు సూపరింటెండెంట్ ఎ.గణేష్‌రెడ్డి ఉత్తమ సేవా అధికారిగా అవార్డు అందుకోవడం అభినందనీయమని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. జైలు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో గణేష్‌ను, జైలు వార్డర్ కె.అప్పలనాయుడులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఖైదీల్లో పరివర్తన, సంక్షేమం, సంస్కరణలు, సదుపాయాలు, జైలును ఏ గ్రేడ్‌లో నిలిపేందుకు సూపరింటెండెంట్ చేస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం



మాకవరపాలెంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్

మాకవరపాలెం: జగనన్న కాలనీల్లో పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. శుక్రవారం నుంచి సచివాలయాల్లో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియను తహసీల్దార్ మురళీమోహనరావు పర్యవేక్షించారు. త్వరితగతిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి సూచించారు. లబ్ధిదారులు నిర్లక్ష్యం చేయకుండా ఆధార్‌కార్డు, స్థల పట్టా కాపీలతో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శంకర్, ఈవో సుదర్శనరావు, వీఆర్వో సూర్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశంలో సభ్యుల తీర్మానం



బంగ్రారాజును సత్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

అనకాపల్లి: మార్కెట్ యార్డు అభివృద్ధికి సంబంధించిన పనులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆమోదం తెలిపింది. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 10వ సాధారణ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. మార్కెట్‌యార్డు అభివృద్ధి చేయడం, కమర్షియల్ షాపులను ఖాళీ చేయించి వేలం వేసి, తద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం సమకూర్చేందుకు కమిటీ పాలకవర్గం తీర్మానించింది. ఉత్తర భాగాన కొత్త ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులపై కమిటీ పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలియజేశారు. అంతకు ముందు యార్డులో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ఎస్ సీహెచ్‌వీఎస్ఎన్.బంగ్రారాజుకు సహాయ కార్యదర్శిగా పదోన్నతి లభించడంతో సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి డి.శకుంతల, కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, మెంబర్లు నీటిపల్లి లక్ష్మి, మత్రిపల్లి శోభ, బొబ్బిలి శ్యామల, ఈగల నూకరత్నం, దాడి తులసికుమారి, బొడ్డు జయ, కఠారి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

దత్తక్షేత్రంలో 9 నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు

హాజరు కానున్న గణపతి సచ్చిదానంద స్వామి

అనకాపల్లి: సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు క్షేత్రం నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి గణపతి సచ్చిదానంద స్వామి హాజరవుతారని పేర్కొన్నారు.
ఈ నెల 10వ తేదీన స్వామీజీ దత్తక్షేత్రానికి వస్తారని తెలియజేశారు. ఈ నెల 9న మహాగణపతి యాగం క లశస్థాపన, 10న మోదక హోమం, సాయంత్రం స్వామీజీ స్వాగత సభ ఉంటాయని తెలిపారు. 11న గణపతికి శ్రీచక్రార్చన, పూర్ణాహుతి, దేవతామూర్తులకు మహా కుంభాభిషేకం, సాయంత్రం సీతారాముల కల్యాణం, స్వామిజీ దివ్య నామసంకీర్తనలు ఉంటాయని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు 99497 76677 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



కన్నూరుపాలెం హైస్కూలులో టెన్త్ విద్యార్థులకు ఆయుర్వేదం మందులు అందిస్తున్న వెల్‌నెస్ సెంటర్ ఇన్‌చార్జి వైద్యాధికారి కె.లావణ్య



పంపిణీ చేసిన ఆయుర్వేదిక్ మందులు చూపుతున్న బాలికలు

కశింకోట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కన్నూరుపాలెం ఆయుష్మాన్ భారత్ ఆయుర్వేదిక్ వెల్‌నెస్ సెంటర్ ఇన్‌చార్జి వైద్యాధికారి కె.లావణ్య కోరారు. మండలంలోని కన్నూరుపాలెం హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు జ్ఞాపకశక్తి కోసం సరస్వతీ యారిష్టా, బ్రాహ్మీఘృత ఆయుర్వేదిక్ మందులను శుక్రవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పరీక్షల నేపథ్యంలో ఆరోగ్యం పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో తీసుకోవాలని సూచించారు. వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పగటి పూట ఇవ్వాలి



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

నక్కపల్లి : వ్యవసాయ అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం ఏడుగంటల పాటు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను పగటి పూట సరఫరా చేయాలంటూ పలువురు రైతులు శుక్రవారం ట్రాన్స్‌కో ఏఈ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో వేంపాడు, నెల్లిపూడి, గునిపూడి, అమలాపురం తదితర గ్రామాల రైతులు ఏఈని కలిశారు. ప్రభుత్వం ఏడు గంటల పాటు ఉచితంగా విద్యుత్ అందజేస్తోందని అయితే రాత్రిపూట ఇవ్వడం వల్ల రైతులకు ప్రయోజనం ఉండటం లేదన్నారు. గతంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇచ్చేవారన్నారు. రాత్రిపూట సరఫరా వల్ల రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారన్నారు. విషసర్పాల బారిన పడే అవకాశం ఉన్నందున ఉదయం పూట సరఫరా పునరుద్ధరించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఏఈని కలిసిన వారిలో నెల్లిపూడి సర్పంచ్ సురేష్ వర్మ, రైతు నాయకులు సురేష్‌రాజు, రాంబాబు, శ్రీనివాసరావు, తాతరాజు, రమేష్‌రాజు, సూరిబాబురాజు తదితరులున్నారు.

ఆర్థిక మోసాలపై అవగాహన



కళా బృందం ప్రదర్శన

మాకవరపాలెం: స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు కళాజాతా ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాతా సభ్యులు ప్రస్తుత సమాజంలో ఏవిధంగా ఆర్థిక మోసాలు జరుగుతున్నాయో వివరించారు. చాప చుట్టేసే చిట్‌ఫండ్ కంపెనీల మోసాలపై కళారూపంలో తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అకౌంటెంట్ మహేంద్రకుమార్, క్యాషియర్ రామ్‌గణేష్ పాల్గొన్నారు.

ఉత్తమ డీఈఈకి ఘన సత్కారం



డీఈఈ గౌరీశంకర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

చోడవరం: ఉత్తమ అవార్డు గ్రహీత ఎలక్ట్రికల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యు.గౌరీశంకర్‌ను ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా గౌరీశంకర్‌కు ఉత్తమ సేవా అవార్డు వచ్చింది. వెంకన్నపాలెం సబ్ స్టేషన్ ఆవరణంలో ఆయన్ను ఉద్యోగులంతా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఈఈ పి. చెల్లిబాబు, ఏఈలు ఉదయ్‌కుమార్, రాజు, ఎల్‌ఐలు సింగపల్లి రవికుమార్, వేపాడ సత్యనారాయణ, ప్రేమ చంద్రశేఖర్, యుగంధర్ పాల్గొన్నారు.

ధర్మనిధి సభ్యత్వాలు చేయాలి



ప్రచార ప్రతులను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

పాయకరావుపేట : మండలంలో గల గ్రామాల్లో ధర్మనిధి సభ్యత్వాలు చేపట్టాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ అన్నారు. కేశవరం గ్రామంలో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో గల ఆయా దేవాలయాల్లో ప్రతి వారం భజన కార్యక్రమాలు చేపట్టాలని, ధర్మనిధిపై సభ్యత్వాలు నమోదు చేయాలని, ప్రతి పౌర్ణమికి సామూహిక హారతులు, నగర సంకీర్తనలు చేపట్టాలన్నారు. అనంతరం సమరసత సేవా ఫౌండేషన్ ప్రచార ప్రతులను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల సంయోజక్ తాడి సూర్యమూర్తి, ఖండ సంయోజక్ నీలాపు వెంకటరెడ్డి, ధర్మ ప్రచారక్‌లు కట్టా వీరబాబు, మేడిశెట్టి దివాణం, చేపల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్



అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమణకు పింఛన్ అందజేస్తున్న తిమ్మరాజుపేట వలంటీర్ సాయిలక్ష్మి



అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో రాజులమ్మకు పింఛన్ అందజేస్తున్న నాగులాపల్లి వలంటీర్ రమ్య

మునగపాక : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ మంచి ఫలితాలు ఇస్తోంది. తమకు కేటాయించిన 50 కుటుంబాలకు వలంటీర్లు మెరుగైన సేవలందిస్తున్నారు. దీనిలో భాగంగా తిమ్మరాజుపేటకు చెందిన ముప్పిడి రమణ అనారోగ్యంతో బాధపడుతూ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో సంబంధిత వలంటీర్ ముప్పిడి సాయిలక్ష్మి ఫిబ్రవరికి పింఛన్ రూ.3 వేలు అతనికి అందజేశారు. అలాగే నాగులాపల్లికి చెందిన మంత్రి రాజులమ్మ అనారోగ్యంతో బాధపడుతూ అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో వలంటీర్ మత్ర రమ్య శుక్రవారం రాజులమ్మకు ఫిబ్రవరి నెల పింఛన్ రూ.3 వేలు అందజేసి మానవత్వం చాటుకున్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు లయన్స్ క్లబ్ సేవా మహోత్సవం



మాట్లాడుతున్న క్లబ్ పాస్ట్ చైర్మన్ వర్మ

నర్సీపట్నం: బలిఘట్టంలో లయన్స్ క్లబ్ సేవా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని క్లబ్ పాస్ట్ చైర్మన్ వర్మ శుక్రవారం కోరారు. కార్యక్రమానికి లయన్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ మూర్ విచ్చేస్తున్నారన్నారు. రూ.35 లక్షల విలువ గల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. క్లబ్ ప్రతినిధులు చింతకాయల సన్యాసిపాత్రుడు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎ.గోపాలరావు, పాస్ట్ గవర్నర్ డి.రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

చీడికాడ: కోనాం డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకటలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.
ప్రవేశ పరీక్ష మార్చి 10న పాఠశాలలో ఉంటుందన్నారు.

ఉపాధ్యాయులు మెరుగైన బోధన చేయాలి

యలమంచిలి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, సర్కారీ బడుల బలోపేతానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి అప్పారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమాచార సాంకేతిక నైపుణ్యంపై మూడు మండలాల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. 21వ శతాబ్దంలో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను అందజేయడంలో సమాచార సాంకేతిక నైపుణ్యం ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. తరగతి గదిలో సృజనాత్మకంగా బోధన చేయడానికి ఉపాధ్యాయులంతా ఎప్పటికప్పుడు తమను తాము నవీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా శుక్రవారం యలమంచిలి, రాంబిల్లి, ఎస్. రాయవరం మండలాలకు చెందిన సుమారు 76 మంది మ్యాథ్స్ టీచర్లకు జిల్లా రిసోర్సు పర్సన్లు డి. నిత్యానందం, కె. శ్రీనివాసరాజు ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ పరికరాలను మరింత సమర్థవంతంగా ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. గతంలో మూస పద్ధతిలో కాకుండా శిక్షణ కొత్తదనంతో ఉండటంతో ఉపాధ్యాయులంతా సద్వినియోగపర్చుకున్నారని రిసోర్సు పర్సన్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట హైస్కూల్ హెచ్‌ఎం వై.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

19న ఆలయ నిర్మాణానికి శ్రీకారం



ఆలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు

మునగపాక : మునగపాకలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఈ నెల 19న పెద్ద ఎత్తున శంకుస్థాపన నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో బైపాస్ రోడ్డును ఆనుకుని నూతనంగా నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర రామాలయ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని శుక్రవారం పెద్దలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. శంకుస్థాపన రోజున 5 వేలకు పైగా అన్న సమారాధన ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట పెద్దలు సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, వెలగా శ్రీనివాసరావు, పెంటకోట ఉమేష్, ఆడారి లక్ష్మణరావు, రామజోగినాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.